పోలింగ్ కేంద్రాల పరిశీలన

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి

పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 24: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు పరిశీలించారు. సెక్టోరల్ ఆఫీసర్ జ్యోతి మున్సిపల్ సిబ్బందితో కలిసి పోలింగ్ కేంద్రాల్లో కల్పించాల్సిన వసతులు, గత ఎన్నికలలో ఓటింగ్ సరళి తీరు గురించి ఆరా తీశారు. ఎండల నేపథ్యంలో మరిన్ని వసతులు కల్పించాలని సూచించారు. సమస్యాత్మక కేంద్రాలపై ఆరా తీశారు.

ఆడపిల్ల పెండ్లికి ఆర్థిక సాయం

ఆర్థికసాయం చేస్తున్న శ్రీనివాస్

మంచాల, ఏప్రిల్ 24 : మండలంలోని బండలేమూరు గ్రామానికి చెందిన రమావత్ సబిత వివాహానికి గ్రామానికి చెందిన శ్రీనివాస్ రూ.10 వేల ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో కిషన్ నాయక్, మోత్యానాయక్, వట్టి యాదయ్య, శంకర్ నాయక్, రాములు తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో బోరు మోటర్లు ఇప్పించిన ఎమ్మెల్యే

కొత్తూరు, ఏప్రిల్ 24: కొన్నిరోజులుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న మండల పరిధిలోని తీగాపూర్ వాసులకు ఉపశమనం లభించింది. ప్రజలు నీటికోసం ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి ఈ విషయాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే తన సొంత నిధులు రూ. 2 లక్షలు వెచ్చించి బుధవారం రెండు బోరు మోటర్లు, సామగ్రి ఇప్పించారు. దీంతో తీగాపూర్ వాసుల నీటి కష్టాలు తీరాయి. పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

- ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి
- ఓటు హక్కు వినియోగంపై అవగాహన

అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్డీవో అనంతరెడ్డి, ఇతర అధికారులు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 24 : ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ జిల్లా సంక్షేమాధికారి పద్మజ ఆధ్వర్యంలో దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్‌లకు ఓటు హక్కు వినియోగంపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క ఓటుతో ఎంతోమంది జీవితాలు మార్చేందుకు అవకాశమున్నందున ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగ పర్చుకోవాలన్నారు. ముఖ్యంగా వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం ఓటింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిత, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, సీడీపీవో శాంతిశ్రీ, సూపరింటెండెంట్ క్రాంతికిరణ్, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

షాబాద్ : ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఎంపీడీవో వెంకయ్య అన్నారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో సిస్టమెటిక్ ఓటర్ ఎడ్యుకేషన్, ఎలక్టోరల్ పార్టిసిపేషన్ కార్యక్రమంలో భాగంగా 2024 పార్లమెంట్ ఎన్నికల గురించి బీడీఎల్ చౌరస్తా వరకు 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మీ భవిష్యత్ మీ ఓటు...మీ ఓటు మీ బాధ్యత అని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ శాతం ఓటింగ్ అవుతుందని, ఓటు వేయకపోతే లెక్కలోకి రావు అనే నానుడి ఇప్పటికే గ్రామాల్లో ఉందన్నారు. కానీ పట్టణ ప్రాంతాల్లో కూడా ఓటింగ్ శాతం పెరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఓటు హక్కు వినియోగించుకుందాం... ప్రజాస్వామ్యాన్ని గెలిపించుకుందామని వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ ఎస్ఐ నాగభూషణం, మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ జయరాజ్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, టీఎంసీ అనూష, ఆనంద్, విద్యార్థులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో 2కే రన్ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఎంపీడీవో వెంకయ్య, సిబ్బంది

నేటి కేసీఆర్ రోడ్ షోకు కదలాలి

మంచాల, ఏప్రిల్ 24 : భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ గెలుపును కాంక్షిస్తూ గురువారం భువనగిరి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహించే భారీ రోడ్‌షోకు మాజీ సీఎం కేసీఆర్ హాజరవుతున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేశ్ బుధవారం తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై రోడ్ షోను విజయవంతం చేయాలన్నారు.

వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలి

తుర్కయాంజాల్, ఏప్రిల్ 24 : మున్సిపాలిటీ పరిధి సాగర్ ప్రధాన రహదారిపై వీధి దీపాలు వెలుగకపోవడంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని, వీధీ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు ధన్‌రాజ్‌గౌడ్ కోరారు. బుధవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వంశీ తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి ఆత్మహత్య

షాద్‌నగర్, ఏప్రిల్ 24 : గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందిన ఘటన కొత్తూరు మండలం తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ సమీపంలో సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి ఒంటిపై పసుపు రంగు అంగి, నీలం కలర్ జీన్స్ ప్యాంట్ ఉందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని, మృతుడి వివరాలు తెలిసిన వారు 98480 90426 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

ఓటు ప్రతి పౌరుడి బాధ్యత

పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 24: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని అవినీతి నిర్మూలన కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు మోత్కూరి కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. అవినీతి లేని వ్యక్తికి ఓటేసి ప్రజాస్వామ్యాన్ని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ నియోజకవర్గంపై అవగాహన ఉండి, సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేసే నాయకుడినే గెలిపించాలని కోరారు. వ్యవసాయరంగం, నిరుద్యోగం తదితర రంగాలను దృష్టిలో పెట్టుకుని ఓటు వేయాలని, ప్రతి ఒక్కరు తమ హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ విద్యార్థుల ప్రతిభ

షాబాద్, ఏప్రిల్ 24: ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో గురుకుల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బుధవారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకులాల కళాశాలల విద్యార్థులు మంచి మార్కులు సాధించారు. మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకులాల కళాశాల సికింద్రాబాద్ బాలికల, ముంగనూర్ క్యాంపస్‌కు చెందిన ఎం. అంకిత ఎంపీసీ మొదటి సంవత్సరం ఫలితాల్లో 469 మార్కులు, అదే కళాశాలకు చెందిన జె. సోని ఎంపీసీ మొదటి సంవత్సరంలో 467 మార్కులు సాధించింది. అదే విధంగా మహాత్మాజ్యోతి బాపూలే బీసీ గురుకులాల కళాశాల హయత్‌నగర్ బాలికల, ముంగనూర్ క్యాంపస్‌కు చెందిన బి. రిచు అనే విద్యార్థిని బైపీసీ మొదటి సంవత్సరంలో 436 మార్కులు, అదే కళాశాలకు చెందిన సి. శరణ్య ఎంపీసీ మొదటి సంవత్సరంలో 466 మార్కులు సాధించింది.

సత్తాచాటిన గురుకుల విద్యార్థులు

మొయినాబాద్ : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలకు చెందిన బాలికలు, బాలురు తమ సత్తాచాటారు. మండల పరిధిలోని తోలుకట్టా గ్రామ సమీపంలో ఉన్న చేవెళ్ల గురుకుల బాలికల కళాశాలకు చెందిన విద్యార్థినులు ఇంటర్ మొదటి సంవత్సరంలో 75 శాతం, ఇంటర ద్వితీయ సంవత్సరంలో 95 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో జి తేజా 441/470 , అనతీ 446/470, మొదటి సంవత్సరం బీపీసీ విద్యార్థిని స్ఫూర్తి 431/440 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో వి ప్రియాంక 968/1000, బీపీసీలో శ్రీష 969/1000 సాధించి టాపర్‌లుగా నిలిచారు.

శంకర్‌పల్లి గురుకుల కళాశాలలో...

మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ శంకర్‌పల్లి గురుకుల కళాశాలలో విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. మొదటి సంవత్సరం ఒకేషనల్(పీఎస్‌టీటీ) మొదటి సంవత్సరం విద్యార్థినులు సీహెచ్ శ్రీవర్ష 498/500లు, సీహెచ్ కీర్తన 494/500లు, బి అనూష 493/500, పి శ్రీష 493/500, కే తేజస్విని487/500 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం బీపీసీలో బి అనూష 418/440, సిరివెన్నెల 417/440, ద్వితీయ సంవత్సరం బీపీసీలో అర్చన 888/1000 మార్కులు సాధించారు.

చిలుకూరు గురుకుల కళాశాలలో...

చిలుకూరులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ముందంజలో ఉన్నారు. ఎంపీసీ మొదటి సంవత్సరం బి భానుతేజ 465/470, రణధీర్ 466/470,ఎన్ శశికిరణ్ 467/470, బీపీసీ మొదటి సంవత్సరం విద్యార్థి జగన్ 434/440, ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థి నవీన్ 980/1000, మహేశ్ 981/1000, ద్వితీయ సంవత్సరం బీపీసీ విద్యార్థి దీన్‌దయాళ్ 983/1000 మార్కులు సాధించారు.

మంచాల : మంచాల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 78 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య తెలిపారు. ఇంటర్ రెండో సంవత్సరంలో ఎంఎల్‌టీ విద్యార్థిని కాట్రోత్ మంజుల 912 మార్కులు, ఎంపీసీ విద్యార్థిని సింధూజ 893, బైపీసీ విద్యార్థి ఎస్ సాయితేజ 891మార్కులు సాధించారు. మొదటి సంవత్సరంలో ఎంపీసీ విద్యార్థి అంజలి 384 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచారు.

'నేను తప్పకుండా.. ఓటు వేస్తాను'

సిటీబ్యూరో, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ) : నగరంలో ఓటర్లను చైతన్యపరిచి ఓటింగ్ శాతం పెంచే దిశగా విస్తృతంగా స్వీప్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ ఆదేశాల మేరకు అర్బన్ కమ్యూనిటీ విభాగం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలను చేపట్టి ఓటర్లకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. ఓటు యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్రతి ఓటరూ ఓటు హక్కు వినియోగించుకునేలా ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తూ ఇంటింటికి వెళ్లి బొట్టు పెట్టి.. ఓటు ప్రాధాన్యత తెలియజేస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఓటు వేయాలని, 'ఓట్ ఫర్ ష్యూర్', 'నేను తప్పకుండా.. ఓటు వేస్తాను' అని ప్రతిజ్ఞ చేయిస్తూ.. అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఓటరు జాబితాలో తమ పేరు చెక్ చేసుకోవాలని, ఏ పోలింగ్ బూత్‌లో తమ ఓటు ఉందో తెలుసుకోవాలని, పోలింగ్ తేదీ మే 13ను గుర్తుంచుకోవాలని, ఓటుతోనే మన భవిష్యత్ ముడిపడి ఉన్నదని, నచ్చిన నాయకుడికి ఓటు వేసి ఎన్నుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా అందరి సమన్వయంతో ఓటింగ్ శాతం పెంచేలా అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడుతున్నారు. వీరితో పాటు స్వయం సహాయక సంఘాల మహిళలు, బీఎల్‌వో, సూపర్ వైజర్లు ఓటరు అవగాహన కార్యక్రమంలో పాల్గొని ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నారు.

ఎంఫిల్ ఇన్ రిహాబిలిటేషన్ సైకాలజీ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఫిల్ ఇన్ రిహాబిలిటేషన్ సైకాలజీ పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు తెలిపారు. ఎంఫిల్ ఇన్ రిహాబిలిటేషన్ సైకాలజీ (రెండేళ్ల కోర్సు) మొదటి, రెండో సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షా ఫీజును ఈ నెల 29వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

డిజిటల్ డేటా రక్షణకు పటిష్టమైన టెక్నాలజీ

సదస్సులో మాట్లాడుతున్న ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్‌రంజన్

సిటీబ్యూరో, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ) : ప్రపంచ వ్యాప్తంగా సైబర్ దాడులు ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో డిజిటల్ డేటా రక్షణకు పటిష్టమైన టెక్నాలజీని వినియోగించి ఫైర్‌వాల్స్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్ రంజన్ అన్నారు. బుధవారం నగరంలో డీఎస్‌సీఐ సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఆధ్వర్యంలో ప్రత్యేక సదస్సును నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న జయేశ్‌రంజన్ మాట్లాడుతూ రాష్ట్రంలో సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ డిజిటల్ డేటా రక్షణకు ఉపయోగపడే లా అప్లికేషన్లను రూపొందించాలని సూచించారు. ప్రస్తుతం డిజిటల్ యుగంలో డిజిటల్ డేటా ఎంతో కీలకమైంది. దాని రక్షణకు పటిష్టమైన వ్యూహాలను రూపొందించడానికి సైబర్ నిపుణులు నిరంతరం పనిచేయాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వ వెబ్‌సైట్ కోసం వీపీఏటీ పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న సీసీఓఈ బృందాన్ని జయేశ్‌రంజన్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సీఈఓ డాక్టర్ శ్రీరాం బిరుదవోలు, ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్ డైరెక్టర్ రమాదేవి లంక, ఇన్‌ఫ్రా అండ్ కమ్యూనికేషన్ జాయింట్ డైరెక్టర్ వేణుప్రసాద్, డీఎస్‌సీఐ సీఈఓ వినాయక్ గాడ్‌సే, నాస్‌కాం ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ శ్రీనివాసన్ పాల్గొన్నారు.

నేటి యువత సేవాలాల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

మదన్‌పల్లి పాతతండాలో సేవాల్ విగ్రహ ప్రతిష్ఠాపన హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, వైస్ ఎంపీపీ నీలంమోహన్‌నాయక్ తదితరులు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 24 : సేవాలాల్ మహారాజ్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ సూచించారు. బుధవారం మండలంలోని మదన్‌పల్లి పాతతండాలో వైస్ ఎంపీపీ నీలంమోహన్‌నాయక్, మాజీ సర్పంచ్ రవీందర్‌నాయక్, మాజీ ఎంపీటీసీ మోహన్‌నాయక్‌ల ఆధ్వర్యంలో సేవాలాల్ ఆలయ నిర్మాణంకో సం భూమిపూజ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు. అనంతనం ఆయన మాట్లాడుతూ.. గిరిజనులకు ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందు కు సాగాలన్నారు. సమాజంలో ఆదర్శంగా మారినప్పుడే మంచి పేరు వస్తుందని గుర్తు చేశారు. గిరిజనుల హక్కుల కోసం పోరాడిన నాయ కుడికి ఎప్పటికి రుణపడి ఉండాలన్నారు. దీంతో పాటు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మైహోంగ్రూపు సంస్థల ఎండీ జూపల్లి జగపతిరావు, శంషాబాద్ ఎంపీపీ జయమ్మశ్రీనివాస్, జడ్పీటీసీ తన్వీ రాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, వైస్ చైర్మన్ గోపాల్‌యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడ జీఎస్ఐ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎకెపీ సింగ్, డాక్టర్ మాధ్యుజోసెఫ్‌తో భూవిజ్ఞాన శాస్త్రవేత్తలు

భూవిజ్ఞాన శాస్త్రవేత్తలకు శిక్షణ

ఎల్బీనగర్ , ఏప్రిల్ 24: భూవిజ్ఞాన శాస్త్రవేత్తల జ్ఞానం, అధ్యయన సామర్థ్యం పెంచేందుకు శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (హైడ్రో) సభ్యుడు ఎంఏకేపీ సింగ్ అన్నారు. నాణ్యమైన నివేదికల తయారీ కోసం పంప్డ్ స్టోరేజీ హైడ్రో ప్రాజెక్ట్ సైట్లలో డీపీఆర్-స్టేజ్ బయోసైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్‌పై శిక్షణ ఏర్పాటు చేశారు. ఎంఏకేపీ సింగ్ పాల్గొని మాట్లాడుతూ.. నాణ్యమైన వివరణాత్మకమైన ప్రాజెక్ట్ తయారీతో పాటుగా డెవలపర్, కన్సల్టెంట్లు, భూవిజ్ఞాన శాస్త్రవేత్తల సారర్థ్యాన్ని మెరుగుపర్చుతుందన్నారు. శిక్షణకు మొత్తం 46 మంది శాస్త్రవేత్తలు హాజరయ్యారు. కార్యక్రమంలో జీఎస్ఐ శిక్షణ సంస్థ హెడ్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మాధ్యుజోసెఫ్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సాయిబల్ ఘోష్, పీఆర్వో గంజి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉస్మానియా తక్ష్ - 2024' ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 24 : ఉస్మానియా యూనివర్సిటీ 107వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా'ఉస్మానియా తక్ష్ - 2024' బుధవారం ఘనంగా ప్రారంభమైంది. వేడుకలను ముందస్తుగా ఓయూ ఇంజినీరింగ్ కళాశాల నుంచి సెంటెనరీ పైలాన్ వరకు 2కే వాక్ నిర్వహించారు. ఈ వాక్‌కు ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీ ప్రతిష్టను మరింత పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. 25న వర్సిటీలోని అన్ని విభాగాలలో ఓపెన్ హౌజ్ కార్యక్రమాలతో పాటు వివిధ రకాల పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. 26న ఠాగూర్ ఆడిటోరియంలో ఉదయం 10:30గంటలకు జరుగనున్న వేడుకలకు ముఖ్య అతిథిగా నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ విజయ్‌కుమార్ సారస్వత్, గౌరవ అతిథులుగా రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం, అమెరికాలోని ఇమేజియా కార్పొరేషన్ ఫౌండర్, సీఈవో వీణ గుండవెళ్లి హాజరుకానున్నారని వివరించారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని, దీనికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ గేయ రచయిత, కవి జయరాజు హాజరవుతారని చెప్పారు. ఈ వేడుకలకు విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. పైలాన్ వద్ద విద్యార్థుల నృత్యాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, డెవలప్‌మెంట్ అండ్ యూజీసీ ఎఫైర్స్ డీన్ ప్రొఫెసర్ జి.మల్లేశం, వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్, డైరెక్టర్లు, డీన్లు, ప్రొఫెసర్లు, ఉద్యోగులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు, అనుబంధ కళాశాలల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సెంటెనరీ పైలాన్ దగ్గర వాక్‌లో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

షార్ట్ సర్క్యూట్‌తో వాహనం దగ్ధం

ఆదిబట్ల, ఏప్రిల్ 24 : షార్ట్ సర్క్యూట్‌తో మారుతీ వాహనం పూర్తిగా దగ్ధమైంది. ఈఘటన బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఆదిబట్ల ఎస్ఐ బాల్‌రాజ్ వివరాల ప్రకారం.. మోట్లంపల్లి గ్రామం, ఆత్మకూర్ మండలం, వనపర్తి జిల్లాకు చెందిన కురువ మనోహర్ కొన్ని రోజుల క్రితం ఏపీ 25పీ 1453 నెంబర్ గల మారుతీ వాహనాన్ని కొనుగోలు చేశాడు. మంగళవారం తుర్కయాంజాల్ నుంచి ఇబ్రహీంపట్నం వస్తుండగా ఔటర్ రింగురోడ్డు ఎగ్జిట్ నెం12 వద్దకు రాగనే వాహనం ఇంజన్ ముందు భాగం నుంచి పెద్ద ఎత్తున పొగలు రావడంతో మనోహర్ వెంటనే వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపివేశాడు. అప్పటికే వాహనంలో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. అతను ఫైరింజన్‌కు ఫోన్ చేయడంతో వాహనం వచ్చేసరికి మారుతీ వాహనం పూర్తిగా కాలింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రావిర్యాల గిడ్డంగిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు

గిడ్డంగిలో తనిఖీలు చేపట్టిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

బడంగ్‌పేట, ఏప్రిల్ 24: మహేశ్వరం నియోజకవర్గ పరిధిలో ఉన్న తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల గిడ్డంగిని రాష్ట్ర విజిలెన్స్ బృందంతో ఫౌర సరఫరాల ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రతిష్టాత్మకంగా ఉండాలని ఫౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు మాచన రఘునందన్, పఠాన్, హైదర్ అలీఖాన్‌తో పాటు శశిధర్‌రాజ్ అన్నారు. గిడ్డంగిలో ఉన్న రికార్డులను పరిశీలించారు. సరుకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా పంపిణీ ముగిశాఖ గిడ్డంగికి వచ్చే నిల్వలపై నిఘా ఉంటుందన్నారు. గిడ్డంగిలో ఉన్న నిల్వలను పరిశీలించారు. రికార్డుల్లో తేడా రాకుండా ఉండాలని చెప్పారు.

సీడీఎఫ్‌డీ ఇంక్యుబేటర్‌లో మరో స్టార్టప్

సిటీబ్యూరో, ఏప్రిల్ 24(నమస్తే తెలంగాణ) : సెంటర్ ఫర్ డీఎన్ఏ అండ్ ఫింగర్‌ప్రింటింగ్ డయాగ్నోస్టిక్స్‌లోని ఇంక్యుబేషన్ సెంటర్‌లో మరో స్టార్టప్ ఏర్పాటైంది. చిన్న పిల్లలకు సోకే డెవలప్‌మెంటల్ డిస్‌ప్లేసియా ఆఫ్ ద హిప్(తుంటి కీలులో లోపం) సమస్య కారణంగా నవజాత శిశువుకు తీవ్రమైన సమస్యగా మారుతున్నది. ఈ క్రమంలో ఈ వ్యాధిని ముందుగానే డయాగ్నోస్టిక్ చేసేందుకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా పనిచేసే విధానాన్ని టర్న్‌ఇట్ ఏఐ సంస్థ కృషి చేస్తున్నది. ఈ క్రమంలో నవజాత శిశువు ఆరోగ్యకరమైన పెరుగుదలను నియంత్రించే డీడీహెచ్‌ను ముందస్తుగా గుర్తించే వీలు ఉంటుందని దీని ద్వారా చికిత్స త్వరగా అందించడం వలన చిన్నారుల్లో వైకల్యాన్ని దూరం చేసేందుకు వీలు కలుగనుంది.